



# సూర్య

నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM




## లోపాయికారి ఒప్పందం ప్రకారమే మజ్లిస్ ప్రొటెం స్పీకర్: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అందులో భాగంగానే ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని చేశారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలను కాదని ఏ ప్రాతిపదికన ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను చేశారని ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. "ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజలు భాజపాను ఆదరించారు. ఒక్క స్థానం నుంచి 8 సీట్లకు పెరిగాం. 6 నుంచి 14 శాతానికి మా ఓటు బ్యాంకు పెరిగింది. కాంగ్రెస్ పార్టీ తన పాత అలవాటు ప్రకారం శాసనసభ గౌరవాన్ని కాలరాసింది. మజ్లిస్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ పార్టీ వ్యక్తిని ప్రొటెం స్పీకర్‌ను చేసింది. అక్బరుద్దీన్ ఓవైసీని ప్రొటెం స్పీకర్ చేయడాన్ని భాజపా వ్యతిరేకిస్తుంది. అనేక మంది సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌ను చేశారు. ప్రొటెం స్పీకర్ సమక్షంలో భాజపా ఎమ్మెల్యేలు ఇవాళ ప్రమాణ స్వీకారం చేయరు. ఈ అంశంపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తాం. స్పీకర్ ఎన్నికను ఆపాలని డిమాండ్ చేస్తున్నాం. రెగ్యులర్ స్పీకర్ ఎన్నిక తరువాతే భాజపా ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మినా.. దగ్గినా పడిపోతుంది అందుకే మజ్లిస్‌ను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తోంది" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## అసెంబ్లీ సమావేశాలు వాయిదా.. స్పీకర్ ఎన్నిక అప్పుడే




తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 14కు వాయిదా పడ్డాయి. పునఃప్రారంభమైన తొలిరోజున శాసన సభాపతిని ఎన్నుకుంటారు. ఆ మరుసటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగిస్తారు. తర్వాతి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చిస్తారు. ఆ తర్వాత ఎన్ని రోజులు సభ నిర్వహించాలనేది స్పీకర్ ఎన్నిక అనంతరం జరిగే బీఏసీలో నిర్ణయిస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగా.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎంకు చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణం చేయించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ తర్వాత వరుసగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సర్జరీ దృష్ట్యా ప్రమాణ స్వీకారానికి కేటీఆర్ రాలేదు. ప్రమాణ స్వీకారానికి తనకు మరో రోజు సమయం ఇవ్వాలని శాసనసభ సెక్రటరీని ఆయన కోరారు.

## మంత్రులకు శాఖల కేటాయింపు.. ఐటీ, ఆర్థిక మంత్రి ఎవరంటే?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, మంత్రులకు నేడు శాఖలను కేటాయించారు. మంత్రుల శాఖలపై సీఎం రేవంత్ ఇప్పటికే అధిష్టానంతో చర్చలు జరిపారు. దీంతో, ఎవరికి ఏ శాఖ ఇవ్వాలనే అంశంపై క్లారిటీ తీసుకొని కేటాయింపు జరిగింది. కీలకమైన హోంశాఖ సీఎం రేవంత్ వద్దే ఉంది.

**మంత్రులు, వారి శాఖలు ఇవే..**

**రేవంత్ రెడ్డి:** హోం శాఖ, మున్సిపాలిటీ, విద్య
**మల్లు భట్టి విక్రమార్క:** ఆర్థిక శాఖ, విద్యుత్
**దామోదర రాజనర్సింహ:** వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ
**ఉత్తమ్‌కుమార్ రెడ్డి:** సివిల్ సప్లై, నీటి పారుదల,
**సీతక్క:** పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ వెల్ఫర్
**శ్రీధర్‌బాబు:** ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు
**కొండా సురేఖ:** అటవీ శాఖ, దేవాదాయ, పర్యావరణ
**పొంగులేటి శ్రీనివాస్:** సమాచార శాఖ, రెవెన్యూ, హౌసింగ్
**కోమటిరెడ్డి వెంకటరెడ్డి:** ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ
**జూపల్లి:** ఎక్సైజ్, పర్యాటక శాఖ, పురావస్తు
**తుమ్మల నాగేశ్వరరావు:** వ్యవసాయ శాఖ, చేనేత
**పొన్నం ప్రభాకర్:** రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ





# ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తాం

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే మరో పథకాన్ని సీఎం ఇవాళ లాంఛనంగా ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ లోగో, పోస్టర్‌లను ఆవిష్కరించి, తెలంగాణ ప్రభుత్వం తరఫున బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అయ్యాక అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతికుమారి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "ఇవాళ తెలంగాణ ప్రజలకు పండగ రోజు. 2009, డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం కనిపిస్తుంది. నాది తెలంగాణ అని చెప్పే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. ఇక్కడి ప్రజల కోసమే సోనియమ్మ ఆరు గ్యారంటీలను ఇచ్చారు.




ఇవాళ ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. మహిళలు ఈరోజు నుంచి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు" అని తెలిపారు.

## తెలంగాణ ముద్దుబిడ్డకు రూ.2 కోట్ల ఆర్థికసాయం.. చెక్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి



రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తెలంగాణ ముద్దుబిడ్డ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.2 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరుణంలో 6 గ్యారెంటీలలో భాగంగా.. నేడు 2 పథకాలను అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. చేయూత, మహాలక్ష్మీ పథకాలను లాంచ్ చేశారు. ఈ సందర్భంలో బాక్సర్ జరీన్‌కు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. కాగా, ఈ ఏడాది మార్చిలో న్యూఢిల్లీలో జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో జరీన్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆమెకు ఇది రెండో బంగారు పతకం కావడం గమనార్హం.

### కేసీఆర్, రాజాసింగ్ దూరం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేదు. బీజేపీ తరఫున ఎన్నికైన రాజాసింగ్.. ప్రొటెమ్ స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యేను నియమించినందున తాను ఆయన ఎదుట ప్రమాణ స్వీకారం చేయబోనని ప్రకటించారు.

### నేడు స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత స్పీకర్ ఎన్నిక కోసం శనివారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల కానుంది. వికారాబాద్ శాసనసభ్యుడిగా ఎన్నికైన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాసనసభ స్పీకర్‌గా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయన శనివారం సాయంత్రం సీఎం రేవంత్, మంత్రివర్గం సమక్షంలో నామినేషన్ సమర్పిస్తారని తెలిసింది. కాగా రెండో రోజు ఆదివారం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత బాధ్యతల స్వీకరణ కార్యక్రమం, ఆ తర్వాత కొత్త స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతాయి. ఈ నెల 11న సోమవారం జరిగే మూడో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత వాయిదా పడే సభ తిరిగి 12వ తేదీ మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. నాలుగో రోజు సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడుతుంది.

### బీఆర్ఎస్‌కు విపక్ష హోదా

శాసనసభలో మొత్తం 119 మంది సభ్యులకు గాను తెలంగాణ మూడో శాసనసభలో అధికార కాంగ్రెస్‌కు 64, మిత్రపక్షం సీపీఐకి ఒకరు చొప్పున ఎమ్మెల్యేల బలం ఉంది. బీఆర్ఎస్ 39, బీజేపీ 8, ఏఐఎంఐఎంకు ఏడుగురు సభ్యుల బలం కలిగి ఉన్నాయి. అధికార కాంగ్రెస్ తర్వాత ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్ఎస్‌కు విపక్ష హోదా దక్కే అవకాశముంది.

### ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్

మూడో శాసనసభ తొలి సమావేశాలు శనివారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం అసెంబ్లీలో అధికారులతో సమీక్ష తర్వాత భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, ఐఏఎస్ అధికారులు అశోక్‌రెడ్డి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.




## మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు! ప్రతిపాదనలు సిద్ధం చేసిన బోర్డు

రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ పరీక్షలను మార్చి 1 నుంచి ప్రారంభించేందుకు ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. విద్యాశాఖ మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమోదం తీసుకొని ఈ వారం రోజుల్లో టైంటేబుల్‌ను ప్రకటించనుంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎగ్జామ్స్‌కు, జవాబుపత్రాల మూల్యాంకనానికి ఇబ్బంది లేకుండా ఈసారి కొంత ముందుగా పరీక్షలను ప్రారంభించాలని భావిస్తున్నారు. గత విద్యా సంవత్సరం మార్చి 15 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 1-15 మధ్య జేఈఈ మెయిన్ చివరి విడత ఎగ్జామ్స్ ఉన్నాయి కాబట్టి ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత కనీస గడువు ఉంటే విద్యార్థులు సన్నద్ధమవడానికి వీలవుతుంది. దానికితోడు ఇంటర్ తర్వాతే పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి. ఈసారి జూన్ 1వ తేదీ నుంచే ఇంటర్ కళాశాలలు ప్రారంభం కావడంతో కనీసం మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు మొదలుపెట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్ ఉంటాయి.




## చెన్నైలో భారీ అగ్నిప్రమాదం.. రూ.100 కోట్ల ఆస్తి నష్టం

తమిళనాడు రాష్ట్రంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఉత్తర చెన్నైలోని మనాలి సమీపంలోని వైకాడు ప్రాంతంలోని సబ్బు పౌడి గోదాములో ఇవాళ ఉదయం భారీ ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన వస్తువులు నష్టపోయాయి. వెంటనే ఆరు అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నాయి. గత ఐదు గంటలుగా మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్ ఫ్యాక్టరీ కూడా మంటలు చెలరేగిన ప్రైవేట్ గోదాం సమీపంలో ఉంది. దీని కారణంగా మంటలు వ్యాపించే ప్రమాదం ఉంది. దీంతో మనాలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తమిళనాడు అగ్నిమాపక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రియా రవిచంద్రన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు చేస్తున్న ప్రయత్నాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు అని వారు వెల్లడించారు.



## బీజేపీ శాసనసభపక్ష సమావేశం కీలక నిర్ణయం.. తొలిరోజు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తూ నిర్ణయం

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మొదలు కాకుండానే భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు షాకిచ్చారు. తొలిరోజు సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలంతా శనివారం ఉదయం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో సమావేశమయ్యారు. కొత్తగా ఎన్నికైన 8 మంది పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం అయ్యారు కిషన్ రెడ్డి. అనంతరం అందరూ కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ శాసనసభ తొలి సమావేశాలు ఈరోజు ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సభలో చర్చించాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలకు సూచించారు కిషన్ రెడ్డి. అనంతరం కిషన్ రెడ్డి కొత్త ఎమ్మెల్యేలందరితో కలిసి చార్మినార్ దగ్గర అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా ఇవాళ బీజేపీ ఎమ్మెల్యేలు శాసనాసభాపక్షనేతను ఎన్నుకోనున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు. ఫ్లోర్ లీడర్ రేసులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఉన్నారు. అయితే కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్ రెడ్డిపై గెలిచిన వెంకటరమణారెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభకు దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఇవాల్టి అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. MIM ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్ గా ఉండటంతో తనతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ సమావేశానికి రావడం లేదని వీడియో రిలీజ్ చేశారు. దేశాన్ని తిట్టే వారిని ప్రొటెం స్పీకర్ గా ఎలా చేస్తారని ప్రశ్నించారు రాజాసింగ్. ఈ నేపథ్యంలోనే మిగిలిన ఎమ్మెల్యేలు సైతం తొలిరోజు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

## బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేతగా మాజీ సీఎం కేసీఆర్ ఎన్నిక ఏకగ్రీవం



కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ శాసనసభ్యులు తమ పక్షనేతగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకుని బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదాలో నిలిచింది. ఈ నేపథ్యంలో సమావేశమైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఈ మేరకు తీర్మానం చేశారు. శాసనసభాపక్ష నేతగా కేసీఆర్ పేరును బాన్సువాడ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి ప్రతిపాదించగా తలసాని శ్రీనివాస్‌యాదవ్, కడియం శ్రీహరి దాన్ని బలపరిచారు. శాససభాపక్షానికి సంబంధించి మిగిలిన సభ్యుల ఎంపిక బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ బీఆర్ఎస్ఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగిన కారణంగా శనివారం నాటి బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి హాజరు కాలేదు. మిగిలిన 38 మంది ఎమ్మెల్యేలు పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కేసీఆర్‌ను తమ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకుంటూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు.



## చెన్నైలో 50 శాతం అధిక వర్షపాతం నమోదు..

రాజధాని నగరం చెన్నైలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో 50 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అక్టోబరు 1వ తేది నుంచి ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో అల్పపీడనం, మిచౌంగ్ తుఫానులతో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో, ఈశాన్య రుతుపవనాలతో అక్టోబరు 1వ తేది నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నగరంలో సరాసరి వర్షపాతం 781.5 మి.మీ కాగా 50 శాతం అదనంగా 1078.2 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ప్రపంచంలోకెల్లా అత్యధిక ప్రజా ఆమోదం గల నేతగా మోదీ

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ప్రపంచంలోకెల్లా అత్యధిక ప్రజా ఆమోదం గల నేతగా నిలిచారు. దేశంలో మోదీ నాయకత్వాన్ని 76 శాతం ప్రజలు హర్షిస్తుండగా, 18 శాతం మంది మాత్రమే వ్యతిరేకిస్తున్నట్లు మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. మోదీ తర్వాతి స్థానంలో మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రేడర్ ఉన్నారు. ఆయన నాయకత్వాన్ని మెక్సికోలో 66 శాతం మంది ప్రజలు ఆమోదిస్తుండగా, 29 శాతం మంది వ్యతిరేకిస్తున్నట్లు సర్వేలో పేర్కొంది. జనామోదం విషయంలో రెండో స్థానంలో ఉన్న లోపెజ్‌కు, మోదీకి మధ్య 10 శాతం తేడా ఉండటం విశేషం. ప్రధాని మోదీ అగ్రస్థానంలో ఉండటంపై పలువురు బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు సర్వేల్లో కూడా ప్రజామోదంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రథమ స్థానంలో ఉన్నారు. గతేడాది మార్నింగ్ కన్సల్ట్ సంస్థ విడుదల చేసిన సర్వేలో మోదీని 71 శాతం మంది ప్రజలు ఆమోదించారు. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆరో స్థానంలో నిలిచారు.




## రామ్ చరణ్ కి మరో ఇంటెర్నేషనల్ అవార్డ్.!

టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా పాన్ ఇండియా దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "గేమ్ చేంజర్" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా కన్నా ముందు చరణ్ నటించిన "రౌద్రం రణం రుధిరం" తర్వాత అయితే తనకి గ్లోబల్ వైడ్ గా మరింత క్రేజ్ వచ్చింది. అలాగే పలు ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా తనకి రాగా లేటెస్ట్ గా అయితే తనకి మరో ఇంటర్నేషనల్ అవార్డు వచ్చినట్టుగా తెలుస్తుంది. మరి యూఎస్ కి చెందిన ఇంటర్నేషనల్ అవార్డ్స్ పాప్ గోల్డెన్ అవార్డ్స్ వారు ఇండియన్ సినిమా నుంచి బాలీవుడ్ స్టార్స్ నామినేషన్స్ లో రామ్ చరణ్ బెస్ట్ యాక్టర్ గా అయితే గెలుచుకున్నట్టుగా అనౌన్స్ చేసారు. దీనితో రామ్ చరణ్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే లీసెంట్ గానే నెట్ ఫ్లిక్స్ సీఈఓ కూడా చరణ్ ని కలవడంతో గ్లోబల్ గా చరణ్ క్రేజ్ మరింత పెరుగుతుంది అని సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తం చేస్తారు.



## జేఈఈ మెయిన్‌కు 12.30 లక్షల దరఖాస్తులు

దేశవ్యాప్తంగా జనవరి 24వ తేదీ నుంచి జరగనున్న జేఈఈ మెయిన్ తొలి విడతకు రికార్డు స్థాయిలో 12.30 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య 3.70 లక్షలు అధికం. ఈ సారి అత్యధిక దరఖాస్తుల్లో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా.. రెండు, మూడు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిలిచాయి. మహారాష్ట్ర నుంచి 1.60 లక్షల మంది, ఏపీ నుంచి 1.30 లక్షలు, తెలంగాణ నుంచి 1.20 లక్షల మంది పరీక్షలు రాసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జేఈఈ మెయిన్ ర్యాంకులతో ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో చేరొచ్చు. బీటెక్ సీట్ల కోసం మెయిన్‌లో పేపర్-1, బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 రాయాల్సి ఉంటుంది.



## పంజాబ్ లో దొరికిన చైనా తయారు చేసిన పాక్ డ్రోన్


సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) పంజాబ్ పోలీసులతో కలిసి గురువారం రాత్రి అమృత్‌సర్ జిల్లాలోని సరిహద్దు గ్రామంలో సెర్చ్ ఆపరేషన్‌లో పొలంలో పాకిస్తాన్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకుంది. పంజాబ్ పోలీసులతో పాటు తమ బృందంలో ఒకరు ధనో కలాన్ గ్రామం వెలుపల పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని బిఎస్ఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ సమయంలో సైనికులు ఆ ప్రాంతంలో సాధారణ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. రాత్రి 8:45 గంటలకు, గ్రామంలోని పొలంలో సైనికులు పాకిస్థాన్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చైనా తయారు చేసిన మోడల్-డీజేఐ మావిక్ 3 క్లాసిక్ డ్రోన్‌ను పరిశీలించిన అనంతరం బీఎస్ఎఫ్ అధికారులు పంజాబ్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు, రాణియా గ్రామంలో సెర్చ్ ఆపరేషన్‌లో పంజాబ్ పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ జవాన్లు పొలంలో పడి ఉన్న పసుపు ప్యాకెట్ హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో 400 గ్రాముల హెరాయిన్ లభ్యమైంది. బీఎస్ఎఫ్ అధికారులు హెరాయిన్ ప్యాకెట్లను ఘరిండా పోలీసులకు అప్పగించారు. పంజాబ్ పోలీసులతో జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా బుధవారం రాత్రి, రానియా గ్రామం సమీపంలో బలగాల బృందం గస్తీ తిరుగుతున్నట్లు BSF అధికార ప్రతినిధి తెలిపారు.

# తెలంగాణలో 'గాలిపటం' దారెటు..?

### ఎంఐఎం అధినేత అసదుద్దీన్ కీలక వ్యాఖ్యలు..



ఎంఐఎం.. హైదరాబాద్‌లో రివ్వున తిరిగే గాలిపటం.. అధికార పార్టీకి అండగా ఉంటూ పాత బస్తీలో రాజ్యమేలుతోంది. అయితే అధికార పార్టీ మారడంతో.. గాలిపటం.. ఎటు పయనిస్తుందనేది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌కి సపోర్ట్ చేస్తుందా లేక దూరంగా ఉంటుందా అనే విషయంలో ఆ పార్టీకే క్లారిటీ లేదు. కానీ బీజేపీ మాత్రం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. హైదరాబాద్ పాతబస్తీలో కొన్నేళ్లుగా ఎంఐఎందే హవా. 7 సీట్లు పక్కాగా ఖాతాలో వేసుకుని అసెంబ్లీలో తమ వాయిస్ వినిపిస్తుంది. ఇన్నాళ్లూ అధికార పార్టీతో దోస్తీ చేస్తూ తమకు కావాల్సిన పనులు సైలెంట్‌గా చేసుకుంటూ ముందుకు పోతున్నారు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి గులాబీ పార్టీకి అండగా ఉంటూ వచ్చింది ఎంఐఎం. కేసీఆర్ సర్కార్‌కి బయటి నుంచి మద్దతు తెలుపుతూ.. స్నేహపూర్వకంగా గాలిపటం ఎగురుతోంది. ఈసారి కూడా బీఆర్ఎస్సే గెలుస్తుందని ఎంఐఎం ధీమా వ్యక్తం చేసింది. కానీ అనూహ్యంగా బీఆర్ఎస్ అంచనాలు తలకిందులయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ చేతికి అధికార పగ్గాలు వచ్చాయి. దీంతో ఫలితాలు వచ్చిన కొన్ని గంటల్లోనే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మేం ఎప్పుడైనా ప్రభుత్వానికి సహకరిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వానికి మా అవసరం పడదేమో అంటూ అసద్ కామెంట్ చేశారు. ఇన్ని రోజులు బీఆర్ఎస్‌కి సపోర్ట్‌గా ఉన్న ఎంఐఎం.. ఇప్పుడు కాంగ్రెస్‌తో కలుస్తుందా లేకపోతే.. మిత్రధర్మం పాటిస్తూ అధికార కాంగ్రెస్‌కి దూరంగా ఉంటుందా అనే చర్చ జరుగుతుంది. కానీ అధికార కాంగ్రెస్‌కి దూరంగా జరిగితే ఎంఐఎంకే నష్టమనే అంచనాలు ఉన్నాయి. ఎందుకంటే పాత బస్తీలో ఎంఐఎంకి పోటీగా ఎంబీటీ ఉంది. కాంగ్రెస్ గనుక ఎంబీటీని దగ్గరకు తీస్తే ఎంఐఎంపై అది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీతో అంటకాగడం ఎంఐఎంకి అలవాటే అని ఆరోపించారు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్. ఇప్పుడు కాంగ్రెస్‌తోనూ అదే బంధాన్ని కొనసాగిస్తారని ఆరోపించారు. ప్రొటెం స్పీకర్ ఎంపికే దీనికి ఉదాహరణ అంటూ చెప్పుకొచ్చారు రాజాసింగ్. మరో మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎంపీ సీటు గెలవడమే లక్ష్యంగా ఎంఐఎం పని చేస్తోంది. మరి ఈ పరిణామాల నేపథ్యంలో ఎటువైపు ఉండాలో తేల్చుకోలేని పరిస్థితులో ఎంఐఎం ఉన్నట్టు తెలుస్తోంది.



## గెలిచే అవకాశం ఉన్న వారికే టికెట్లు

రాష్ట్ర ప్రజలకు టీడీపీ అవసరం ఎంతో ఉందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో ఆయన భేటీ అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడారు. "గెలిచే అవకాశం ఉన్న వారికే టికెట్లు ఇస్తాను. అంతర్గతంగా చేయించే సర్వేల్లో నాయకుల పనితీరు బాగాలేకపోతే ఉపేక్షించేది లేదు. ప్రత్యామ్నాయం చూపించి పక్కన పెడతా తప్ప పార్టీ ప్రయోజనాలను ఫణంగా పెట్టను. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఓట్ల అవకతవకల విషయాన్ని ఇన్‌ఛార్జ్‌లు బాధ్యతగా తీసుకోవాలి. అన్నీ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందనే అలసత్వం వద్దు" అని పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరించారు. అనంతరం గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు కొట్టుకుపోయిన అంశాన్ని టీడీపీ నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గేటు కొట్టుకుపోయిందని నేతలు ఆరోపించారు. ఉదయమే సంఘటనాస్థలానికి వెళ్లి.. వారు చేసిన క్షేత్రస్థాయి పరిశీలనను చంద్రబాబుకు నేతలు వివరించారు.

**కలిసి పనిచేద్దాం..**
**జగన్‌ను ఇంటికి సాగనంపుదాం**

ప్రతి కార్యక్రమంలో తెలుగుదేశం - జనసేన నేతలు కలిసి వేదికను పంచుకోవాలని జనసైనికులకు చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయిలోనూ కలిసి పనిచేస్తూ జగన్‌ను ఇంటికి సాగనంపుదామని ఆయన పిలుపునిచ్చారు.

## తెలుగు సినిమాలకు సామ్ బైబై

ఈ గ్యాప్ ఇంకా ఎన్నాళ్లు..? ఇప్పుడు సమంతను చూసి ఇదే అడుగుతున్నారు అభిమానులు. ఎందుకంటే ఆమెను చూస్తుంటే అంతా సెట్ అయిపోయినట్లే కనిపిస్తుంది. అనారోగ్యంగా ఉన్నట్లు ఎక్కడా కనిపించట్లేదు.. పైగా సోషల్ మీడియాలో కుక్క పిల్లలతో ఆడుకుంటున్నారు. అంతా బాగానే ఉన్నపుడు ఆలస్యమెందుకు..? మళ్లీ సినిమాల్లోకి వచ్చేస్తారా లేదంటే వన్ ఇయర్ కండీషన్‌కు కట్టుబడి ఉంటారా..? సినిమాలు చేసినా చేయకపోయినా కొందరు హీరోయిన్లకు కల్ట్ ఫ్యాన్స్ ఉంటారు. సమంత కూడా ఇదే లిస్టులోకి వచ్చే హీరోయిన్. కొన్నేళ్లుగా ఈమె పెద్దగా సినిమాలైతే చేయట్లేదు. 2023లో శాకుంతలం, ఖుషీతో వచ్చినా.. అవి కూడా ఎప్పుడో సైన్ చేసిన సినిమాలు. ఈ మధ్య కొత్త ప్రాజెక్ట్స్ ఏవీ ఒప్పుకోలేదు ఈ బ్యూటీ. పైగా మయోసైటిస్ కారణంగా సినిమాలకు కూడా ఓ ఏడాది బ్రేక్ ఇచ్చారు.అనారోగ్యం కారణంగా చికిత్స కోసం అమెరికా వెళ్లిన స్యామ్.. అక్కడ్నుంచి ఇండోనేషియా, ఇస్తాంబుల్, ఇటలీ అంటూ చాలా దేశాలు తిరిగారు. లైఫ్ హాయిగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ మధ్యే కెప్టెన్ మార్వెల్ చిత్రానికి సీక్వెల్ ది మార్వెల్స్ తెలుగు ప్రమోషన్ స్యామ్ చేసారు. అందులోనూ చాలా యాక్టివ్‌గా కనిపించారు అయితే సినిమాలకు మాత్రం నో అంటున్నారు. కావాలనే తెలుగు ఇండస్ట్రీకి దూరం అవుతున్నారా.. హాలీవుడ్, బాలీవుడ్ కోసం టాలీవుడ్‌కు దూరం అవుతున్నారేమో అనిపిస్తుంది సమంతను చూస్తుంటే..! ఇదే నిజమైతే స్యామ్‌ను ఇక తెలుగు సినిమాల్లో చూడటం కష్టమే.






## ఆ మూడు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులెవరు?

ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్ , రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ భారీ మెజారిటీ సాధించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మిజోరం, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటైంది. అయితే మధ్యప్రదేశ్ , రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలి? అనేదానిపై బీజేపీ నాయకత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ మూడు రాష్ట్రాల్లోనూ సీఎం పదవి కోసం పోటీ పడుతున్నవారి వారి జాబితా భారీగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రి పీఠాలను ఎవరికి కట్టబెడతారనే అంశంపై సస్పెన్స్ నెలకొంది. దీనిగురించి ఢిల్లీలో బీజేపీ సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ మూడు రాష్ట్రాల్లో సీఎం విషయంలో బీజేపీ ఎప్పటికి నిర్ణయం తీసుకుంటుందనే ప్రశ్న అలానే మిగిలివుంది. సోమవారం (డిసెంబర్ 11) జరగనున్న శాసనసభా పక్ష సమావేశంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి ఎన్నిక జరగనుందని తెలుస్తోంది. అదే సమయంలో ఆదివారం (డిసెంబర్ 10) రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో శాసనసభా పక్ష సమావేశాలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి ఎవరనేది ఆరోజు ప్రకటించే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రుల ఎంపిక కోసం మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లకు ముగ్గురు చొప్పున పరిశీలకులను బీజేపీ నియమించింది. రాజస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్, వినోద్ తావ్డే, సరోజ్ పాండే వ్యవహరిస్తుండగా, మధ్యప్రదేశ్ ఛత్తీస్‌గఢ్‌లకు మనోహర్ లాల్ ఖట్టర్ , కే లక్ష్మణ్, ఆశా లక్రా పరిశీలకులుగా నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్‌కు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ గౌతమ్‌లను పరిశీలకులుగా నియమించారు. రాజస్థాన్‌లో మాజీ సీఎం వసుంధర రాజే, మహంత్ బాలక్‌నాథ్ పేర్లు ముఖ్యమంత్రి పదవి రేసులో వినిపిస్తున్నాయి. ఆదివారం జరిగే శాసనసభా పక్ష సమావేశం తర్వాత ఇక్కడ సీఎం ఎవరనేది తేలనుంది. మధ్యప్రదేశ్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది డిసెంబర్ 11 నాటికి తెలియనుంది. సోమవారం భోపాల్‌లో బీజేపీ శాసనసభా పక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలోనే సీఎం పేరు ఖరారు కానుంది. కాగా రాజస్థాన్‌లోని 199 స్థానాలలో భారతీయ జనతా పార్టీ 115 సీట్లు గెలుచుకుంది. ఒక స్థానానికి ఎన్నిక వాయిదా పడింది. ఇక మధ్యప్రదేశ్ విషయానికి వస్తే రాష్ట్రంలోని 230 మంది సభ్యుల అసెంబ్లీలో బీజేపీకి 163 సీట్లు వచ్చాయి. 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో భారతీయ జనతా పార్టీ 54 స్థానాలను గెలుచుకుంది.

## తెలంగాణలో 8,815 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీ



తెలంగాణలో 8,815 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆమె ఈ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 1,777 అంగన్‌వాడీ వర్కర్స్, 7,038 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మనుషులను తరలించే నకిలీ ఏజెంట్లు తెలంగాణలో 113 మంది, ఏపీలో 471 మంది ఉన్నారని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. గత అక్టోబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 2,925 మంది నకిలీ ఏజెంట్లను గుర్తించి ఈ-మైగ్రేట్ పోర్టల్‌లో వారి పేర్లను వెల్లడించినట్లు చెప్పారు.